ప్రజాశక్తి
బుధవారం 6 నవంబర్ 2024
5
విజయనగరం

## అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడాకారులు 6లోగా పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో తీసుకు రాబోతున్న నూతన క్రీడా పాలసీ ప్రకారం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)లో జిల్లాలోని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన, పాల్గొన్న క్రీడాకారులు తమ వివరాలను ఈనెల 6లోగా అందజేయాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయ ఖేలో ఇండియా స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు తమ వివరాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ,విజయనగరం, పార్వతీపురం మన్యం వారికి అందజేయాలని తెలిపారు. వివరాలకు 9491767327, 8341052254 (విజయనగరం) 9701648344(మన్యం) నెంబర్ లను సంప్రదించాలని తెలిపారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో విజయగౌరి

- విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం
- పాఠశాలల మూసివేత, అక్రమ బదిలీలపై అలుపెరుగని ఉద్యమాలు
- యుటిఎఫ్ మండల కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయి నేతగా ఎదుగుదల

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యుటిఎఫ్ (ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ మేరకు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఆమెను అభ్యర్థిగా ప్రకటించారు. వివిధ సంఘాలు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచాయి. విజయగౌరి విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాటం చేశారు. యుటిఎఫ్ సాధారణ కార్యకర్తగా చేరిన ఆమె అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర నాయకురాలిగా ఎదిగారు. రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటివాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు చొరవ చూపారు. జిఓ నెంబర్ 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన కేసు ఏడేళ్లపాటు నడిచింది. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు. 1996 నుంచి బొబ్బిలి ప్రాంతంలో యుటిఎఫ్ విస్తరణకు కృషి చేశారు. యుటిఎఫ్ బొబ్బిలి మండల తొలి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆమె, అనంతరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సహాధ్యక్షులుగా, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ యుటిఎఫ్ ఉద్యమాల్లోనూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేయడంలోనూ కీలకపాత్ర పాత్ర పోషించారు. ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా చురుకైన పాత్రపోషిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

సిపిఎస్ రద్దు ఉద్యమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి (ఫైల్)

### విద్యార్థి దశ నుంచే ప్రగతిశీల భావాలు

విజయగౌరి చిన్ననాటి నుంచే ప్రగతిశీల భావాలు గలవారు. ఆమె అన్నయ్య తిరుపతిరావు ప్రోత్సాహంతో హైస్కూల్‌లో చదువుతుండగానే ఎస్ఎఫ్‌లో చేరారు. అప్పటికే విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు భవాని వెంట వెళ్లేవారు. అలా మొదలైన ఆమెలో నాయకత్వ లక్షణాలు చదువు పూర్తయ్యేవరకు ఎస్ఎఫ్ఎఫ్ నాయకురాలిగా కొనసాగేలా చేశాయి. కాలేజీ స్థాయి నుంచి ఎస్ఎఫ్ఐలో క్రియాశీలక కార్యకర్తగా, చురుకైన నాయకురాలిగా పనిచేశారు. ఉపాధ్యాయ వృతిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగాను, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలలపాటు 20మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్యమాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

### ఇదీ కుటుంబ నేపథ్యం..

విజయగౌరి తండ్రి సంజీవ్ నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈ ప్రభావం కుటుంబంపై ఉండడంతో అన్నదమ్ములు, అక్కచెల్లెలు అంతా ఉన్నత చదువులు అభ్యసించిన వారే. అంతకు మించి ప్రగతిశీల భావాలు గలవారు. విజయగౌరి భర్త సత్యంనాయుడు కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘకాలంగా జనవిజ్ఞాన వేదికలో పని చేస్తున్నారు. సోదరుడు కీర్తిశేషులు కె.శేషగిరి ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని ఉపాధ్యాయ సంఘాలనూ ఏకతాటిపైకి తీసుకొచ్చి విద్యారంగ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన విషయం తెలిసిందే. మరో సోదరుడు తిరుపతిరావు కూడా అభ్యుదయ భావాలు గల వ్యక్తి. ఇంజినీరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. చెల్లెలు రమాప్రభ సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా చిల్డ్రన్స్ క్లబ్ నడుపుతున్నారు. ఇలా కుటుంబ సభ్యులంతా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

# మూడో వారం నుంచి ధాన్యం కొనుగోలు

- పకడ్బందీగా ధాన్యం సేకరణ
- జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నవంబరు మూడో వారం నుంచీ జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభం కానుందని, దీనికోసం ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బంధీగా ఈ ప్రక్రియను నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 3,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించే అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో జెసి పాల్గొని మాట్లాడారు.పరిస్థితులు, పంట దిగుబడిని బట్టి జిల్లాను 258 క్లష్టర్లుగా విభజించామని, ఒక్కో క్లష్టర్‌లో రెండు లేదా మూడు రైతు సేవా కేంద్రాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని 501 రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లు, రైతుమిత్ర సంఘాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 26 లక్షల గోనె సంచులు అవసరమని, ఒక్కో మిల్లుకు దాని సామర్థ్యం బట్టి 30వేల గోనె సంచులను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ధాన్యం తరలింపునకు సుమారు 3వేలు వాహనాలను సిద్ధం చేస్తున్నా మని, జిపిఎస్ సదుపాయం కలిగిఉండి, సివిల్ సప్లయిస్ వద్ద నమోదు చేసుకున్న వాహనాల ద్వారా మాత్రమే ధాన్యం తరలింపు జరుగుతుందని తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకొని ఈ-కెవైసి పూర్తయిన రైతులు, తమధాన్యం విక్రయిం చేందుకు సిద్ధమైన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను ఉచితంగా సరఫరా చేస్తామని, ఒకవేళ రైతులు వాటిని స్వయంగా సమకూర్చుకుంటే అందుకు అయిన ఖర్చులను ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలోకి ధాన్యం సొమ్ముతో సహా చెల్లిస్తుందన్నారు. సాధారణ రకం (కామన్) క్వింటాలు(100 కేజీలు)కు రూ.2300, 40 కేజీలకు రూ.920, 80 కేజీలకు రూ.1840 వంతున కనీస మద్దతు ధర చెల్లిస్తాన్నారు. గ్రేడ్-ఎ రకం ధాన్యంకు రూ.2320, 40 కేజీలకు రూ.928, 80కేజీలకు రూ.1856 ధర చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, జిల్లా సహకార అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతి చెందిన ఎస్ఐ కుటుంబానికి 'చేయూత'

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఎస్ఐ కుటుంబానికి చేయూత ను అందించేందుకు పోలీసు సిబ్బంది పోగు చేసిన మొత్తాన్ని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవసాత్తు లేదా ఆకస్మికంగా లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుండి బెనిఫిట్స్ అందే వరకు వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు పోలీసుశాఖకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, కొంత మొత్తాన్ని పోగు చేసి, వారి కుటుంబాలకు 'చేయూత'గా అందజేయడం అభినందనీయమని న్నారు. జిల్లా పోలీసుశాఖలో కొత్తవలస పోలీసు స్టేషనులో ఎస్ఐగా పని చేసిన కె.వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించగా, వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు పోలీసు సిబ్బంది పోగు చేసిన రూ.1,48,400చెక్‌ను ఆయన సతీమణి కె.బంగారమ్మకు ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, ఆఫీసు సూపరింటెండెంట్ ఎ.ఎస్.వి.ప్రభాకరరావు, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

# విచ్చలవిడి పశు సంచారాన్ని సహించబోం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధాన రహదారులపై విచ్చలవిడి పశు సంచారాన్ని సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ప్రధాన కాలువలపై పలువురు దుకాణదారులు పలకలు వేయడాన్ని గమనించారు. తక్షణమే ఆ సచివాలయ ఎమినిటీ కార్యదర్శిని పిలిచి వివరణ కోరారు. కాలువలపై పలకలు వేస్తున్న సమయంలోనే ఎందుకు నిలుపుదల చేయలేదని ప్రశ్నించారు. దీనివల్ల కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. డివైడర్ల మధ్యలో చెత్త పేరుకుపోవడాన్ని గమనించి మందలించారు. ఆ తర్వాత దాసన్నపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారులపై పశువులు నిలుపుదల చేయడాన్ని గమనించారు. పశు పెంపకం దారులను పిలిచి తక్షణమే పశువులను ప్రత్యేక ప్రాంతాలకు తరలించాలని, రహదారులపై విడిచిపెట్టరాదని చెప్పారు. అందరి సహకారంతో నగరాభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు అనుసరించి మసలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

**నాగావళి నదిని ఇసుక మాఫియా దోచేస్తోంది. చీకటి పడితే లారీలన్నీ నదిలోకి క్యూ కడుతున్నాయి. దర్జాగా యంత్రాలను ఉపయోగించి ఇసుకను తవ్వి తరలించేస్తున్నారు. వాస్తవానికి రీచ్‌ల్లోకి యంత్రాలకు అనుమతులు లేనప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో మాఫియా రెచ్చిపోతుంది. వీరి ఆగడాలకు అధికారులు సైతం వంత పాడటంతో నాగావళి బక్కచిక్కిపోతుంది.**

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

చీకటి పడితే క్యూ కడుతున్న లారీలు

చక్రం తిప్పుతున్న టిడిపి నాయకులు

# నాగావళిని దోచేస్తున్నారు

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని తమరాం సమీపంలో నాగావళి నదిలోని ఇసుకను అక్రమార్కులు దోచేస్తున్నారు. రాత్రి పూట లారీలతో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమార్కుల వ్యాపారం మూడు టిప్పర్లు, ఆరు లారీలుగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక వ్యాపారంలో ప్రజా ప్రతినిధులు ఎవరూ జోక్యం చేసుకోవద్దని ప్రకటన జారీ చేసినా అధికార పార్టీకి చెందిన మండల కీలక నేత అక్రమార్కులతో చేతులు కలిపి చక్రం తిప్పుతున్నాడు. ప్రభుత్వ చట్టాలను, ఆదేశాలను అమలు చేయాల్సిన అధికారులు కొందరు అక్రమార్కులతో చేతులు కలపడంతో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది.

### రాత్రి సమయాల్లో లారీల మోత

సంతకవిటి ఇసుక రీచ్‌లో పగటి పూట కనిపించని లారీలు రాత్రి పూట మాత్రం మోత మోగిస్తున్నాయి. వందలాది లారీలో నదిలో దిగి ఇసుకను తరలించేస్తున్నాయి. ఈ ఇసుక రీచ్‌ను గుప్పిట్లో పెట్టుకుని టిడిపి నాయకులు రోజుకు లక్షల రూపాయలు దోచుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక స్థానిక ప్రజలకు అందుబాటులో లేనప్పటికీ.. ఇతర జిల్లాలకు భారీగా తరలిపోతుంది. ఉచిత ఇసుక పాలసీ నిబంధనల ను ఉల్లంఘిస్తూ కొందరు మధ్యవర్తులు, స్మగ్లర్లు ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో ట్రాక్టర్ ఫుల్ రూ.5వేలకు, లారీ ఫుల్ రూ.18వేలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఇసుకాసురులకు సంబంధిత అధికారుల అండదండలు ఉండటంతో పెట్రేగిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

### పొక్లెయినర్‌తో పెద్ద పెద్ద గోతులు

నాగావళి నదిలోకి యంత్రాలను దింపి పొక్లెయినర్‌తో పెద్ద పెద్ద గోతులు తవ్వి ఇసుకను తరలించేస్తున్నారు. ఈ గోతుల వల్ల వరద వచ్చే సమయంలో ముంపునకు గురవుతుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పైగా గోతుల్లో నీరు చేరి లోతు తెలియక పశువులు, ప్రజలు అందులో పడి మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గోతుల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనని వాసుదేవపట్నం, గోళ్ళవలస, ఎం.ఆర్ అగ్రహారం, సంతకవిటి, మందరాడ, గరికిపాడు తదితర గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి ఇసుక రవాణాను అడ్డుకొని ప్రజాసంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

### ఎమ్మెల్యే పేరుతో దోపిడీ

ఇసుక రీచ్‌లో కొంత మంది తెలుగు తమ్ముళ్లు సొంత యంత్రాలు పెట్టుకొని అక్రమ రవాణా చేస్తున్నారు. ఎవరైనా అడిగితే ఎమ్మెల్యే పేరు వాడేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా కనీసం సంతకవిటి పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రొక్లయిన్ యంత్రాల సహాయంతో పగలంతా ఒక చోట డంపింగ్ చేసి పెట్టుకొని, రాత్రి సమయంలో లారీలతో ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. ఫలితంగా వేల కోట్లు రూపాయలు దోచుకు తింటున్నారు.

### ముందస్తు సమాచారంతో గప్‌చుప్

పత్రికలు, వార్తా ఛానళ్లు, ఎవరైనా ఫిర్యాదులు చేస్తే జిల్లా అధికారులు ఈ రీచ్‌కు తనిఖీకి వస్తారని తెలిసిన మరుక్షణం లారీలకు బంద్ ప్రకటిస్తారు. అధికారులు జిల్లా కేంద్రంలో బయలు దేరుతున్నట్లు వారికి ముందే సమాచారం తెలిసిపోవడంతో గుట్టుచప్పుడు కాకుండా వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేసి ఆ రోజు సెలవు ప్రకటించేస్తున్నారు. తనిఖీలు అనంతరం అధికారులు వెళ్ళిపోతే ఇక యధావిధిగా తమ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

# వెయిట్ లిఫ్టింగ్‌లో రన్నర్‌గా సత్య డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర యూనిర్సిటీ అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ పోటీల ఛాంపియన్‌షిప్‌లో సత్య డిగ్రీ, పీజీ కళాశాల రన్నర్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయిదేవ మణి తెలిపారు. ఈ పోటీలు విశాఖపట్నం బుల్లయ్య కాలేజ్ లో ఈనెల 2న జరిగాయి. ఈ పోటీల్లో ఎ.యశశ్రీ 64కేజీల విభాగంలో (స్నాచ్) బంగారు పతకం, ఎస్.పల్లవి 71 కేజీల విభాగంలో (స్నాచ్) బంగారు పతకం, బి.నీరజ 45 కేజీల విభాగంలో (స్నాచ్) బంగారు పతకం, ఆర్. రాంబాబు96 కేజీల విభాగంలో (స్నాచ్) బంగారు పతకం, ఎ.లిఖిత్ 67కేజీల విభాగము లో (స్నాచ్) రజిత పతకం సాధించారని తెలిపారు. వీరంతా నవంబర్ మూడవ వారంలో జరగబోయే సౌత్ వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వీరిని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, ఫిజికల్ డైరెక్టర్లు మహేష్, ప్రసాద్, కోచ్ చల్లారాము పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశి భూషణరావు

# నీటి కాలుష్యం వల్లే ఎరుకొండలో డయేరియా

## ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ప్రాథమిక నిర్ధారణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని ఎరుకొండ గ్రామంలో డయేరియా ప్రభలడానికి నీరు కలుషితం కావడమే కారణమని తేలింది. ఈమేరకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ప్రాథమిక అంచనా వేసింది. ఈనెల 3న ఈ గ్రామంలోని 14మంది డయేరియా భారిన పడిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్థానిక పిహెచ్‌సిని, గ్రామాన్ని సందర్శించి, మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని కూడా హెచ్చరించారు. ఈనెల 3న గ్రామంలో పర్యటించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం స్థానిక రాజవీధి, దళితకాలనీల్లో తాగునీటి పైపులైన్లు మరమత్తులకు గురయ్యాయని గుర్తించింది. దీంతో పాటు గ్రామంలోని కొంతమంది కుళాయి కనెక్షన్ల కోసం తవ్వకాలు చేపట్టారు. దీంతో, పైపులైన్లను పాడయ్యాయి. వీటి ప్రభావం వల్ల డయేరియా వచ్చి ఉండొచ్చని ఆ బృందం భావిస్తోంది. ఈనేపథ్యంలో కలెక్టర్ తాగునీటి కాలుష్యాన్ని అరికట్టేందుకు, ఈ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, తదితర శాఖల మధ్య సమన్వయం పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాల్సివుంది. లేదంటే గ్రామాల్లో గుర్ల లాంటి ఘటనలు చోటుచేసుకున్నా ఆశ్యపడాల్సిన అవసరం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

# టెట్ టాపర్స్‌కు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టీచర్స్ ఎలిజిబులిటి టెస్ట్‌లో అత్యున్నత ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయిలో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభినందించారు. టెట్‌లో జిల్లా కేంద్రంలోని అంబటిసత్రంకు చెందిన కోండ్రు అశ్విని ఎస్‌జిటి విభాగంలో 150కి 150 మార్కులను, దాసరి ధనలక్ష్మి 149.99 మార్కులను సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే 149.56 మార్కులను సాధించిన దేవ హారిక మరికొందరితోపాటు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురినీ జిల్లా కలెక్టర్ అంబేద్కర్ తమ ఛాంబర్‌లో అభినందిం చారు. ఇదే పట్టుదలతో చదివి ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని, మరింత ఉన్నత స్థానాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు కూడా పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన అశ్విని ..తన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, శంకర్రావు ప్రోత్సాహంతోనే విజయం సాధ్యమైందని తెలిపింది. తండ్రి ఆటో నడుపుతూ తనను చదివించారని తెలిపింది.

ఆకులసీతంపేటలో ఇంజన్‌తో నీటిని తోడుతున్న రైతులు

## రైతులకు నీటి కష్టాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వరి పంట వేసిన రైతులకు నీటి కష్టాలు తప్పడం లేదు. వరి పంట ఆరుగాలం కష్టపడి పండించే రైతు చేతికి వచ్చే సమయంలో వరుణ దేవుడు కరుణించకపోవడంతో రైతులు నీటిని ఇంజనుతో తోడించి పంటను తడుపుకుంటున్నారు. గెడ్డ వాగుల్లోనూ, చిన్న చిన్న గుంతలలో నిల్వ ఉన్న నీటిని ఇంజన్లతో తోడి పంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సింగరాయి, ఆతవ, ఆకుల సీతంపేట, నల్లబెల్లి, కెఆర్‌పేట, బల్లంకి, లంకికుంపల్లి గ్రామాలలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు పంటను తడిపేందుకు పాట్లు పడుతున్నారు.

## 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉద్యోగులు స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అజిత్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు అప్పలనాయుడు, సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతబత్యాలు లేక రోడ్డున పడ్డామని ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డిఇఒలకు జీవో నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - భోగాపురం

మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కిరణ్ కుమార్ తెలిపారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

## రాష్ట్రాభివృద్ధే ప్రధాన అజెండా

ప్రజాశక్తి - గుర్ల

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వం ప్రధాన ఎజెండాగా పనిచేస్తుదని టిడిపి సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి అన్నారు. మండలంలోని పాలవలసలో మంగళవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు సభ్యత్వ నమోదు శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ సుంకరి పైడినాయుడు, వల్లూరు బంగారు నాయుడు, సుంకరి ఉపేంద్ర, వల్లూరు భాస్కరరావు, వల్లూరు పైడితల్లి నాయుడు, వల్లూరి గౌరునాయుడు, సుంకరి శ్రీనివాసరావు, సంచాన అప్పలనాయుడు, తాడ్డి గౌరనాయుడు, సుంకరి రమణ, ఇజ్జురోతు బంగారు నాయుడు, తాడ్డి పెంటంనాయుడు, గేదెల సత్యం, జనసేన పార్టీ నాయకులు సంచాన శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పార్టీ సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

## స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భోగాపురం

విజయనగరం ఆర్‌డిఒ దాట్ల కీర్తి మంగళవారం మండలంలో పర్యటించారు. ఓ ప్రైవేటు వ్యక్తికి పెట్రోల్ బంక్ మంజూరైంది. ఈ పెట్రోల్ బంక్‌ను భోగాపురం గ్రామంలో హైవే పక్కన ఉన్న స్థలంలో ఏర్పాటు చేస్తుండటంతో ఆ స్థలాన్ని ఆమె పరిశీలించారు. ముంజేరు రెవెన్యూలో ఒక లేఅవుట్ యాజమాన్యం కాలువపై కల్వర్టు ఏర్పాటుకు దరఖాస్తు చేయడంతో దానిని కూడా పరిశీలించారు. తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆంధ్ర, ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని డాక్టర్ పివిజి రాజు ఎసిఎ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం నుంచి 9వ తేదీ వరకు ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ జరగనుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్‌బాబు తెలిపారు. ఆంధ్ర జట్టుకు ఎస్.కె.రషీద్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు.

**ఆంధ్ర జట్టు సభ్యులు**

ఎస్.కె.రషీద్ (కెప్టెన్), టి.విజయ్, కె.ఎస్.భరత్, జి.హనుమ విహారి, షేక్ ఎండీ రఫీ, వై.సందీప్, ఎం.వంశీకృష్ణ, ఎం.అభిషేక్ రెడ్డి, కె.వి.శశికాంత్, సి.ఆర్.జ్ఞానేశ్వర్, సిహెచ్ స్టీఫెన్, పివి సత్యనారాయణరాజు, ఎ.లలిత్ మోహన్, జి.మనీష్, కె.కరణ్ షిండే, ఎం.హేమంత్‌రెడ్డి.

## చిరుద్యోగుల తొలగింపు సరికాదు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో వివిధ శాఖలకు చెందిన చిరుద్యోగుల తొలగింపు చర్యలు సరికాదని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు అన్నారు. మంగళవారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికార పార్టీ నాయకులు చిరుద్యోగులను తొలగించటం అన్యాయమన్నారు. వచ్చే కొద్దిపాటి జీవితంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న చిరుద్యోగులను తొలగించడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గ్రహించాలన్నారు. కొంతమంది చోటామోటా నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఆయా శాఖలకు చెందిన చిరు ఉద్యోగులను తొలగించడం సబబు కాదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని, లేకుంటే న్యాయ పోరాటానికి వెళ్తామని అధికారులను హెచ్చరిం చారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు?

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో వరి చేను కోతలు ప్రారంభమై, నూర్పులు కూడా పూర్తవుతున్నా ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యాలు తయారైనప్పటికీ ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో లైన్ వ్యాపారస్తులకు రైతులు అతి తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా వర్షాభావ ప్రభావంతో ఇప్పటికే కొంత నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు

## నాగభరణం సమర్పణ

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణంలో గల జగన్నాథ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గల భీమలింగేశ్వర స్వామి వారి దేవస్థానానికి పాలకొండకు చెందిన వేమకోటి వెంకటరామ శర్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వేమకోటి మణిల్ కుమార్ శర్మ (శ్రీ కోటదుర్గ అమ్మవారి దేవస్థానం అర్చకులు), వేమకోటి శ్రీనివాస్ శర్మ, వేమకోటి హరీష్ కుమార్ శర్మ మంగళవారం స్వామి వారికి సుమారు రూ.30వేలు విలువ కలిగిన నాగభరణం దేవస్థానానికి సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు గాశీ దాసు, ఇతర భక్తులు పాల్గొన్నారు.

## ఆయుష్ వైద్యంపై ఆశా వర్కర్లకు శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆయుర్వేద విధానంపై ఆశాలు అవగాహన పెంచుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. మంగళవారం, డోకిసీల, పెద్ద బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి, అక్కడి ఆశా వర్కర్లకు ఆయుష్ వైద్య విధానం పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశలకు ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానం ద్వారా దీర్ఘ కాలిక, మానసిక వ్యాధులను తగ్గించవచ్చు అని, ఆహారపు అలవాట్లు జీవన విధానాలతో రుగ్మతలను ఎలా తొలగించుకోవాలి, మధుమేహంపై అవగాహన ఔషధ మొక్కల గురించి , ప్రాణాయామం యోగ పద్ధతులను వివరించి దానికి సంబంధించిన పుస్తకాలను బ్రోచర్లను ఆశా వర్కర్లకు పంపిణీ చేశారు. ప్రజలలో మరింత అవగాహన పెంచేందుకు జాతీయ ఆయుష్ కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందని ఆమె తెలిపారు.

# రచ్చకెక్కిన కూటమి కలహాలు

- టిడిపి నిర్వీర్యమే లక్ష్యంగా జనసేన అడుగులు
- వైసిపి నాయకులకు ఉపాధి పనులు అప్పగించడంతో తేటతెల్లం
- పనుల కేటాయింపులో ఎమ్మెల్యే వివక్ష చూపారంటున్న తమ్ముళ్లు
- ఎమ్మెల్యే కార్యక్రమాలను బహిష్కరించాలని టిడిపి నిర్ణయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

**నెల్లిమర్ల నియోజకవర్గంలో టిడిపిని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా స్థానిక జనసేన ఎమ్మెల్యే పావులు కదుపుతున్నారా? అంటే తెలుగు తమ్ముళ్లతోపాటు సాధారణ ప్రజానీకం నోట కూడా ఔననే సమాధానం వినిపిస్తోంది. టిడిపిని పూర్తిగా పక్కనబెట్టడంతో తెలుగు తమ్ముళ్లు కూడా ఎమ్మెల్యే కార్యక్రమాలను, సమావేశాలను ఏకంగా బహిష్కరించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ రెండు పార్టీల నడుమ ఇన్నాళ్లూ అంతర్గతంగా సాగిన రాజకీయ విభేదాలు నాలుగు రోజుల క్రితం జరిగిన నెల్లిమర్ల నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం తరువాత బహిర్గతమైపోయాయి.**

గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన మధ్య కుదిరిన పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే లోకం మాధవి సుమారు 39వేల ఓట్ల ఆధిక్యంతో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై విజయం సాధించారు. అయితే ఇదంతా జనసేన బలం అనుకుంటే పొరపాటే. అంతకు ముందు 2019 ఎన్నికల్లో జనసేన తరపున పోటీచేసినప్పుడు కేవలం 7వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈనేపథ్యంలో కేవలం తమ బలంతోనే ఇక్కడ జనసేన గెలించిందన్నది తెలుగు తమ్ముళ్ల వాదన. పార్టీ తరపున టిక్కెట్ దక్కకపోతే స్వతంత్రంగానైనా పోటీచేస్తానంటూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఒకానొక దశలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత పార్టీ అధిష్టానం బుజ్జగింపుతో పోటీ నుంచి వెనక్కి తగ్గారు. అయితే లోకం మాధవి తీరా గెలిచిన తరువాత కొద్దిరోజుల నుంచే పొత్తు ధర్మం పక్కన పెట్టారన్న విమర్శలు ఉన్నాయి. ఆమె ఏకపక్ష వైఖరితో కూటమి కలహాలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఇక్కడ జనసేన గెలుపుతో తిరిగి టిడిపి హవానే సాగుతుందని టిడిపి నాయకులు, కార్యకర్తలు భావించారు. కానీ, ఎమ్మెల్యే వైఖరితో వారి ఊహలు, వ్యూహాలు తలకిందులయ్యాయి. మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది బదిలీల విషయంలో తమ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలంటూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బంగార్రాజు ఎమ్మెల్యేను కోరారట. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మండలాల వారీగా జాబితాను అడిగి మరీ, వాటిని పనిగట్టుకుని తప్పించారన్నది టిడిపి నాయకుల వాదన. ఇటీవల ప్రారంభమైన పల్లె పండగలో భాగంగా కేటాయించిన ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ పనులను టిడిపి కన్నా వైసిపి నాయకులకే ఎక్కువ పనులు, నిధులు కేటాయించారని తెలుగు తమ్ముళ్లు అగ్గిమీద గుగ్గిలమైపోతున్నారు. గ్రామాల్లో చిన్నా చితక పంచాయతీల విషయంలో కూడా ఎమ్మెల్యే ఎంట్రీ అయిపోతున్నారని, అందులోనూ గ్రామంలో నిన్న మొన్నటి వరకు కనీసం ఉనికిలోలేని జనసేన కార్యకర్తలు చెప్పినట్టుగా చేయాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని, దీని వల్ల తమకు విలువ లేకుండా పోతుందని కూడా టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు కూటమి ప్రభుత్వం అంటూనే మండల, గ్రామ స్థాయి పర్యటనల సమాచారం, అక్కడ చేపడుతున్న కార్యక్రమాల గుర్తించి కూడా చెప్పడం లేదని కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వారం రోజుల క్రితం వరకు అంతర్గతంగా సాగిన రాజకీయ వైరం ఇటీవల జరిగిన నెల్లిమర్ల నగర పంచాయతీ పాలకవర్గ సమావేశంలో బహిర్గతమైపోయింది. ఈ సందర్భంగా ఏకంగా మార్క్‌ఫెడ్ చైర్మన్ హోదాలో హాజరైన బంగార్రాజును 'మీరు సమావేశంలో లోపలికి ఎందుకు వచ్చారు. ఇక్కడి నుంచి బయటకు వెళ్లండి' అంటూ ఎమెల్యే ఆగ్రహించడం, 'మీరు చైర్మన్ కుర్చీలో ఎందుకు కూర్చుకున్నారు?' అంటూ ఆయన నిలదీయడం, 'మీరు బయటకు వెళ్లకపోతే నేనే బయటకు పోతా' అంటూ ఎమ్మెల్యే కోపంగా వెళ్లిపోవడం, సమావేశం వాయిదా వేయాలనే ఎమ్మెల్యే ఆదేశాలను పక్కనబెట్టి పాలక మండలి సమావేశం కొనసాగించడం వంటి సన్నివేశాలతో టిడిపి, జనసేన మధ్య నెలకొన్న వైరం తారా స్థాయికి చేరింది. అందుకు తగ్గట్టే ఎమ్మెల్యే కార్యక్రమాలను బహిష్కరించాలంటూ బంగార్రాజు నాయకత్వంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు, క్రియా శీలక కార్యకర్తలు తరువాత రోజే సమావేశం ఏర్పాటు చేసుకుని నిర్ణయం చేయడం గమనార్హం.

జరిగిన పరిణామాలన్నీ పార్టీ అధిష్టానం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తాన్నామని, తాజా పరిణమాలపై మరోసారి ఫిర్యాదు చేస్తామని కూడా టిడిపి నాయకులు ప్రకటించారు. నియోజకవర్గంలో అత్యంత బలంగా వున్న టిడిపి కేడర్‌ను, నాయకత్వాన్ని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోపే నిర్వీర్యం చేయడంద్వారా ఆ కేడర్‌ను తమ పార్టీవైపు తిప్పుకోవడంతో పాటు వైసిపి కేడర్‌ను కూడా తమవైపు తిప్పుకోవడానికే ఉపాధి పనులు ఎర చూపి తమ బలాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా జనసేన పావులు కదుపుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## ఎన్నికల కోడ్ అమలుకు బృందాలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్న సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కోసం అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. మండల స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమా వళి అమలును ఈ బృందాలు పర్యవేక్షి స్తాయని ఆయన వెల్లడించారు. మున్సిపల్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ సభ్యులుగా ఉంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ ఈ బృందంలో సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమాలు అమలు కోసం మొత్తం 23 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వీటికి అదనంగా బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, నెలిమర్ల, విజయనగరం, ఎస్.కోటలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అక్రమ నగదు వ్యవ హారాలు, అనుమానాస్పదంగా ఉన్న నగదు బదిలీలు, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు జరిగే ప్రయత్నాలపై నిఘా ఉంచుతాయని స్పష్టం చేశారు. వీటికి అదనంగా ఆరు స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. నిర్ణీత ప్రదేశంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో నగదు మద్యం వంటి వాటి అక్రమ రవాణాలను నిరోధించేందుకు ఈ బృందాలు పనిచేస్తాయని తెలిపారు.

## 11న ముగడలో కోలాటం, నృత్యం పోటీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

కరపత్రాలను విడుదల చేస్తున్న జెసి రాజు, తదితరులు

బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 11న బాడంగి మండలం ముగడ గ్రామంలో కోలాటం, నృత్యం పోటీలు నిర్వహించనున్నట్లు కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జెసి రాజు, బొబ్బిలి మల్టీ టాలెంట్ గ్రూపు సంస్థ అధ్యక్షులు జి.కరుణకుమార్, కొరియోగ్రాఫర్ చిన్నికృష్ణ తెలిపారు. పోటీలకు సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు కోలాటం, డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని, బాల, బాలికలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ముగడలో ఉదయం 7.30గంటల నుంచి 11.30గంటల వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి బాల, బాలికలు హాజరు కావాలని కోరారు. ప్రతిభ కనబరిచిన 10 టీములను ఎంపిక చేసి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు సిహెచ్ అప్పలనాయుడు, పి.నాగరాజు, టి.వెంకటరమణ, ఎం.గౌరినాయుడు, డిజె దామోదర్, రాముద్రి గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

## పంటల బీమా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తవలస

జీడి మామిడి తోటల రైతులు తప్పనిసరిగా పంట బీమా నమోదు చేసుకోవాలని మండల ఉద్యానధికారి అనిత తెలిపారు. మంగళవారం మండలంలో రెల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జీడి మామిడి పండించే రైతులకి ప్రతికూల వాతావరణం పరిస్థితులు, ప్రకృతి వైపరిత్యాలు వల్ల నష్టం వాటిల్లితే నష్ట పరిహారం అందేలా చేయటం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంట బీమాని ప్రవేశపెట్టిందన్నారు. ఈ భీమా పథకంలో జీడి రైతులు స్వచ్ఛందంగా ప్రీమియం ఎకరాకు రూ. 1500 చెల్లించాలన్నారు. వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం 2024-25 రబీ సీజన్‌లో పంట సరిగ్గా పండక పోతే నేరుగా రైతు అకౌంట్‌కి రూ.30వేలు జమవుతాయని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో విఎఎ ప్రసన్న, విహెచ్ ఎం.ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

## కారి గొల్లపేటలో తాగునీటి ఇబ్బందులు

ప్రజాశక్తి - భోగాపురం

అధికారికి సమస్యను వివరిస్తున్న యువకులు

భోగాపురం పంచాయతీ పరిధిలోని కారి గొల్లపేట గ్రామంలో గత 20 రోజుల నుంచి తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని యువకులు చెబుతున్నారు. వ్యవసాయ బోర్లు తోపాటు పక్క గ్రామమైన కొయ్యపేట వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆ గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు మంగళవారం పంచాయతీ కార్యాలయంతో పాటు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి చెప్పినప్పటికీ సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. గ్రామంలో ఉన్న ఒక్క బోరుపై ఆధారపడే వాళ్ళమని ఇప్పుడు ఆ బోరు కూడా మరమ్మతులకు గురైనట్లు వివరించారు. కుళాయిలు మరమ్మతులకు గురై 20 రోజులు గడిచినప్పటికీ కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ చిన్నారావుకు సమస్యను వివరించడంతో అధికారులు దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస, వియ్యంపేట పిహెచ్‌సిల పరిధిలో గల ప్రజలు చవితి పండగ సందర్భంగా కలుషిత నీరు, నిల్వ ఆహార పదార్థాలు, మాంసం, చేపలు, మద్యం వల్ల, తిన్న ఆహారం జీర్ణం కాక వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు గోపాలకృష్ణ, సీతల్‌వర్మ తెలిపారు. కారం, మసాలాలు తగ్గించి, వేడి వేడి ఆహార పదార్థాలు మితంగా తినాలని, వండిన ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు. కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్స్ పిల్లలు తినకుండా చూడాలని సివియర్ గ్యాస్ట్రిటీస్ వల్ల కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం ఉంది కావున అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో ఎఎన్ఎమ్, ఆశ వర్కర్స్ దగ్గర జ్వరాలకు, వాంతులు, విరోచనాలుకు మందులు, ఒఆర్ఎస్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సివియర్ కండిషన్‌లో పిహెచ్‌సిలకు రావాలని సూచించారు.

## స్కూటీ దగ్ధంపై కేసు నమోదు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

దగ్ధమైన ద్విచక్ర వాహనం

మండలంలోని పెద్దరవ్వం గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో జరిగిన స్కూటీ దగ్ధంపై కేసు నమోదు చేసినట్లు బుధరాయవలస ఎస్ఐ జె. లోకేష్ కుమార్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో బైరిపురం గ్రామానికి చెందిన సబ్బిశెట్టి జస్వంత కుమార్ తన తండ్రి పార్వతీశంతో కలసి పెద్దరవ్వం గ్రామం శివార్లో ఉన్న తమ మామిడి తోటను చూడటానికి తమ స్కూటీ పై వెళ్లి (స్కూటీ నెంబర్ 125) తోట బయట పార్క్ చేసి తోటలోనికి వెళ్లారు. ఈ లోగ ఆ స్కూటీపై జశ్వంత్‌కుమార్ పెదనాన్న కుమారుడు సబ్బిశెట్టి శ్రీను, వదిన లక్ష్మి బైక్‌పై పెట్రోల్ పోసి తగల పెట్టారని బుధరాయ వలస పోలీస్ స్టేషన్‌లో జశ్వంత్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. అన్న దమ్ములైన సబ్బిశెట్టి రామారావు, సబ్బిశెట్టి పార్వతీశంకు సంబంధించిన ఈ తోట గురించి కొన్ని సంవత్సరాలు నుంచి వారిరువురు మధ్య గొడవలు అవుతున్న సందర్భంలో సబ్బిసెట్టి రామారావు కుమారుడు శ్రీను, కోడలు లక్ష్మి ఈ విధముగా చేశారని ఆరోపణ నేపథ్యంలో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయొద్దు

ప్రజాశక్తి- రాజాం

మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐ

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే మద్యం దుకాణాల యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం టౌన్ సిఐ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహణ, మద్యం అమ్మకాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. రాజాం టౌన్‌లో 7 లైసెన్స్ మద్యం షాపులు ఉన్నాయని వాటి పరిధిలో ఎటువంటి బెల్ట్ షాపులూ నిర్వహించరాదని, నిర్వహణ కోసం గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సింగిల్ విండో ద్వారా అనుమతులు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి రాజకీయ పార్టీలు అభ్యర్థులకు సింగిల్ విండో ద్వారా అవసరమైన అనుమతులు మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఈ సింగిల్ విండో సెల్ కు నోడల్ అధికారిగా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎల్.జోసెఫ్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. హెలిపాడ్ ఏర్పాటు, బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రదర్శనల నిర్వహణ, లౌడ్ స్పీకర్ల ఏర్పాటు వాహనాల ఏర్పాటు తదితర ప్రచారానికి అవసరమైన అనుమతులను ఈ సింగల్ విండో సెల్ ద్వారా మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీసు, రోడ్లు భవనాలు, ఫైర్, విద్యుత్, పురపాలక, రవాణా శాఖల అధికారులు ఈ సింగిల్ సెల్ లో పనిచేస్తారని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఈ సింగిల్ విండో సెల్ పని చేస్తుందని వెల్లడించారు.

## వారి తప్పేమీ లేదు : ఎంఇఒ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడ జెడ్‌పి ఉన్నతపాఠశాల, ఎంపిపి పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్ ఏ తప్పు చేయలేదని, టిడిపి నాయకుల ఒత్తిడి మేరకు తాను ఆఫైల్‌పై సంతకం చేయాల్సి వచ్చిందని మండల విద్యాశాఖ అధికారి 2 కె.శ్రీనివాసరావు అన్నారు. నారన్నాయుడు వలస గల పాఠశాలకు ప్రత్యేక అధికారిగా ఉన్నానని, తాను విధి నిర్వహణలో ఉన్నానని చెప్పినా, మీరు ఆఫీసుకు వస్తారా లేదా మమ్మల్ని రమ్మంటారా అని టిడిపి నాయకులు, ఎస్ఎంసి చైర్మన్లు తనను బెదిరించి బలవంతంగా ఎండిఎం కార్మికుల తొలగింపు ఫైల్‌పై సంతకాలు చేయించారని ఆవేదన చెందారు. తాను ఏడేళ్లగా ఎంఇఒగా విధులు నిర్వహిస్తున్నానని, ఏనాడూ వారు తప్పు చేయలేదనీ, వారిపై ఆ గ్రామం నుంచి ఫిర్యాదులు రాలేదని ప్రజాశక్తికి తెలిపారు. పైగా ఆ ఫైల్ పై సర్పంచ్ సంతకం కూడా లేదని చెప్పినా తనపై ఒత్తిడి చేశారని అన్నారు. ఈ విషయంపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు స్పందిస్తూ ఎంఇఒను బెదిరించి సంతకాలు చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి నాయకులు పాఠశాలల్లోకి చొరబడి అక్కడ వంట వండుతున్న మహిళలపై నోరు పారేసుకొని అసభ్య కరంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## అందని విద్యా హక్కు చట్టం

**కార్పొరేట్ పాఠశాలల్లో పూర్తి కాని 25 శాతం ప్రవేశాలు**



ప్రజాశకి-విజయనగరం టౌన్

పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్, ప్రయివేటు విద్య అందించడానికి తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. కిలోమీటరు దూరంలో నివాసం ఉండే విద్యార్థులకు మాత్రమే సమీపంలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అవకాశం కల్పించాలని ఈ చట్టంలోని నిబంధన పేద విద్యార్థులు ఆయా విద్యా సంస్థల్లో అడ్మిషన్లు తీసుకోవడానికి అడ్డంకిగా మారింది. విజయనగరం జిల్లాలో 2000 మంది విద్యార్థులు కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల్లో అడ్మిషన్లు తీసుకునే అవకాశం ఉండగా, కేవలం 1326 మంది మాత్రమే ప్రవేశాలు పొందగలిగారు.

**పేద విద్యార్థుల ప్రవేశాల్లో కోత !.**

2010 విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రయివేటు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలి. జిల్లాలోని 400కు పైగా ప్రైవేటు విద్యాసంస్థల్లో 2024-25 విద్యా సంవత్సరంలో లక్ష మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో సెక్షన్‌కు 40మంది విద్యార్థుల చొప్పున 400 విద్యా సంస్థల్లో సుమారుగా 9వేల మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. దీన్ని పరిగణలోకి తీసుకుంటే 2వేల మందికి పైగా పేద విద్యార్థులకు ప్రయివేటు సంస్థల్లో ఉచితంగా అవకాశం కల్పించాల్సి ఉంది. కిలో మీటరులోపు నివాసం ఉండాలనే నిబంధన కారణంగా అత్యధికంగా సుమారుగా 700 మంది పేద విద్యార్థులు ప్రవేశాలను పొందలేక పోయారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో విద్యాహక్కు చట్టం అమలు పూర్తి స్థాయిలో ప్రచారం కల్పించి పేద విద్యార్థుల ప్రవేశాలకు అవకాశం కల్పించాలని జెడ్‌పిటిసి సభ్యులు విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ ఏడాది అధికారులు ప్రయివేటు పాఠశాలల ప్రవేశాలకు వరుసగా నోటిఫికేషన్లు విడుదల చేశారు. అయితే కిలోమీటరులోపు విద్యార్థులను మాత్రమే పాఠశాలలో చేర్చుకోవాలనే నిబంధనలతోపాటు ఈ చట్టం ద్వారా పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరగలేదు.

మూడు కిలోమీటర్లలోపు ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విలీనానికి గత ప్రభుత్వం చర్యలు తీసుకోగా తాజాగా ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు కిలోమీటరు దూరాన్ని ప్రాతిపదికగా తీసుకుంది. ఇలా ఒకపక్క ప్రాథమిక పాఠశాలలను దూరం చేసిన ప్రభుత్వం... మరోపక్క విద్యాహక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో పేద విద్యార్థులు నష్టపోతున్నారు.

## హెచ్‌సి కృష్ణమూర్తికి డాక్టరేట్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కె. కృష్ణమూర్తి గత 10 ఏళ్లుగా పేద ప్రజలకు, వృద్ధులు, వికలాగులు, వితంతువులు, విద్యార్థులకు అందిస్తున్న సహాయ, సేవలకు మెచ్చి డే స్ప్రింగ్ టెక్నాలజీ యూనివర్సిటీ ( టెక్సాస్,అమెరికా) ఈ నెల 4న హైదరాబాద్‌లో డాక్టరేట్ ప్రధానం చేసి సత్కరించారు. ఈ ప్రధానోత్సవంలో ఆ సంస్థ ఛైర్మన్, డైరెక్టర్ ఎం.వి. ప్రసాద్, డాక్టర్ అబ్దుల్ రెహమాన్, కౌన్సిలర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ గత పదిహేళ్లుగా అన్ని వర్గాల వారికి సహాయం చేయడం అభినందించదగిన విషయమన్నారుఎ. కృష్ణమూర్తిని పోలీస్ శాఖతోపాటు ఇతర స్వచ్ఛంద సంస్థలు, ఆదర్శంగా తీసుకుని సమాజంలో ఉన్న ఎందరో అభాగ్యులకు ఎంతో కొంత సహాయ పడాలని కోరారు.